సాక్షి ప్రకాశం
సోమవారం । 31 । మార్చి । 2025



కారుణ్య వర్షిణి రంజాన్
నేడు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకునేందుకు జిల్లావ్యాప్తంగా ఉన్న ఈద్గాలు, మసీదులు ముస్తాబయ్యాయి. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు దీక్షలు ముగించారు. - 8లో..



అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి
పంట పొలాల్లో విద్యుదాఘాతానికి గురై అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం రాత్రి కంభం మండలం లింగాపురం అటవీ సమీపంలో తిప్ప వద్ద జరిగింది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
40/23

వాతావరణం
ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

ఒంగోలు వన్‌టౌన్: ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌లు ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు.

నేడు వక్ఫ్ చట్ట సవరణపై నిరసన

ఒంగోలు వన్‌టౌన్: వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని కోరుతూ రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం ఈద్ నమాజ్ అనంతరం పాత కూరగాయల మర్కెట్ సెంటర్‌లో ఉన్న మౌలానా అబుల్ కలాం అజాద్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేయనున్నట్లు ముస్లిం ప్రజా సంఘాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్ల రిబ్బన్‌లు ధరించి శాంతియుతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు.

జీవ సమాధికి యత్నం !

● అడ్డుకున్న పోలీసులు



సమాధిలోకి వెళ్తున్న కైపు కోటిరెడ్డి

తాళ్లూరు: ఓ వ్యక్తి సజీవ సమాధి అయ్యేందుకు సమాధిలోకి ప్రవేశించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అతడిని సమాధి నుంచి బయటకు తీసుకొచ్చిన ఘటన తాళ్లూరు మండలం విఠలాపురంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విఠలాపురంలో స్థానిక భూదేవి ఆలయం వద్ద కైపు కోటిరెడ్డి అనే వ్యక్తి తాను సజీవ సమాధి అవుతున్నానని చెప్పి అందుకు ఏర్పాట్లు చేసుకుని గుంత తవ్వి అందులోకి దిగి పైన రేకు వేసేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ప్రజలు దానిని చూసేందుకు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఎందుకు ఇలా చేస్తున్నావని గ్రామస్తులు అడిగితే ఈ ప్రపంచం అంతా శాంతియుతంగా ఉండాలని, కులమతాలు లేకుండా అందరూ ఐకమత్యంతో మెలగాలని కోరుకుంటూ నేను దీక్ష తీసుకొని సజీవ సమాధి అవుతున్నానని చెప్పాడు. ఈలోపు విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అతనిని లోపలి నుంచి బయటికి తీసి ఇకపై ఇటువంటి పనులు మళ్లీ చేయవద్దంటూ హెచ్చరించారు. ఇదంతా ప్రచారం కోసం చేసిన ప్రయత్నమని ఎస్సై మల్లికార్జునరావు తెలిపారు. అతను ఆరోగ్యంగానే ఉన్నాడు.



సమాధిని తీయిస్తున్న పోలీసులు

రాష్ట్రంలో బీజేపీ అజెండా అమలు చేస్తున్న కూటమి

ఒంగోలు వన్‌టౌన్: రాష్ట్రంలో బీజేపీ అజెండాను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్కే సైదా విమర్శించారు. ఒంగోలులోని డీసీసీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైదా మాట్లాడారు. ఒంగోలు నగరంలోని కబాడీపాలెం వద్ద ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం కూల్చివేయడం దారుణమన్నారు. తమకు సమాచారం ఇస్తే తామే ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసేవారిమన్నారు. విగ్రహాన్ని ప్రభుత్వం తిరిగి ఏర్పాటు చేయకపోతే ఉద్యమం నిర్వహిస్తామన్నారు.

అన్నీ ఆర్భాటాలే..

వెనుకబడిన కనిగిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామంటూ మాయమాటలతో ఆర్భాటపు ప్రకటనలు..ఉత్తుత్తి శంకుస్థాపనలు చేయడం ఆ తరువాత వాటి ఊసే పట్టించుకోకపోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజం. గతంలో ప్రకటించిన ఓ ఒక్క ప్రాజెక్టునూ ఆచరణలోకి తేకపోగా మళ్లీ నేడు కంప్రెస్డ్ ఇంటిగ్రేటెడ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామంటూ హడావిడి చేస్తున్నారు. 2 వేల ఎకరాల్లో ఏర్పాటు చేస్తామని చెబుతున్న ఈ ప్లాంట్ ఏర్పాటుకు ఇంత వరకూ భూసేకరణకు భూములనే గుర్తించ లేదు. ఫ్లోరైడ్‌తో సతమతమతమవుతున్న తమకు తాగేందుకు గుక్కెడు మంచినీళ్లు ఇవ్వాలని వేడుకుంటున్నా కనికరించని కూటమి ప్రభుత్వం ఇలా మాయమాటలతో మభ్యపెట్టాలని చూస్తోందని జనం మండిపడుతున్నారు.

- కనిగిరిలో ట్రిపుల్ ఐటీ, సోలార్ విద్యుత్ ప్లాంట్లు అంటూ మాయ మాటలు
- శంకుస్థాపనలే తప్ప అంగుళం కూడా ముందుకు సాగని వైనం
- నేడు కంప్రెస్డ్ ఇంటిగ్రేటెడ్ బయోగ్యాస్ ప్లాంట్ అంటూ హంగామా?
- 2 వేల ఎకరాలు ఎక్కడ నుంచి ఇస్తారు ?
- కనీసం పీసీపల్లి రైతులతో చర్చించని ప్రభుత్వ పెద్దలు
- పీసీపల్లి మండలంలో మంత్రులు, అధికారులు హడావిడి



బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు శంకుస్థాపన కోసం చదును చేసిన భూమి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మొన్న ట్రిపుల్ ఐటీ..మధ్యలో సోలార్ విద్యుత్ ప్లాంట్.. నేడు కంప్రెస్డ్ ఇంటిగ్రేటెడ్ బయోగ్యాస్ ప్లాంట్.. ఇలా చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పుడల్లా ఈ ప్రాంత ప్రజలను మాయ మాటలతో మోసం చేస్తూనే ఉన్నారు. బాబు ప్రకటించిన వాటిలో ఒక్క ప్రాజెక్టు అయినా ప్రారంభానికి నోచుకుందా అంటే లేదనే అంటున్నారు జిల్లా వాసులు. వెనుకబడిన ఈ జిల్లాకు సంబంధించి చంద్రబాబు ఎప్పుడూ ఆర్భాటంగా ప్రకటనలు చేయడం..హడావుడిగా శంకుస్థాపనలు చేయడం తర్వాత వాటిని గాలికొదిలేయడం పరిపాటిగా మారింది. కనిగిరి నియోజకవర్గంలో నిమ్జ్, ట్రిపుల్‌ఐటీ, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు విషయంలో ఎలాంటి ప్రణాళికలు లేకపోవడం, భూసేకరణ చేయకపోవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పీసీపల్లి మండలంలో కంప్రెస్డ్ ఇంటిగ్రేటెడ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు పేరుతో చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు.

ట్రిపుల్ ఐటీ, సోలార్ హబ్‌ల పేరుతో హంగామా..

2019 ఎన్నికలకు ముందు కనిగిరి నియోజకవర్గంలోని పామూరు మండలంలో సుమారు 250 ఎకరాల్లో ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటు చేస్తున్నామంటూ సీఎం హోదాలో చంద్రబాబు ప్రకటించారు. 2018 ఆగస్టు 7వ తేదీన ఎంతో ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. ఆ కార్యక్రమానికి మంత్రులు, రాష్ట్ర అధికారులు హాజరై హంగామా చేశారు. ఆ తర్వాత అది అంగుళం కూడా ముందుకు సాగలేదు. భూసేకరణ దశలోనే నిలిచిపోయింది. అదే ఏడాది సోలార్ హబ్ కేంద్రాన్ని కనిగిరి నియోజకవర్గంలోని సీఎస్‌పురం మండలం గోగులపల్లి వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి హడావుడి చేశారు. సుమారు 5 వేల ఎకరాల భూ సేకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు గ్రామ సభలు పెట్టి ప్రజలను ఊరించి.. ఆ తర్వాత దాని ఊసే ఎత్తలేదు. సోలార్ హబ్ ప్లాంట్ పై ఎంతో ఆశించిన నియోజకవర్గ ప్రజలకు ఎదురుచూపులే మిగిలాయి.

తాజాగా కంప్రెస్డ్ ఇంటిగ్రేటెడ్ బయోగ్యాస్ ప్లాంట్

కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలం దివాకరపల్లి, వెంగళాయపల్లి గ్రామాల్లో కంప్రెస్డ్ ఇంటిగ్రేటెడ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు కూటమి ప్రభుత్వ పెద్దలు హడావుడి చేస్తున్నారు. దీని ఏర్పాటుకు సుమారు 2 వేల ఎకరాల భూమి అవసరమవుతుందని అధికారులు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికి సుమారు 1,200 ఎకరాలు అధికారులు సిద్ధం చేసినట్లు వెల్లడిస్తున్నారు. వాస్తవానికి పెద ఇర్లపాడు రెవెన్యూ విలేజ్‌లోని దివాకరపల్లి, వెంగళాయపల్లి గ్రామాల్లో సుమారు 475 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు అధికారులు గుర్తించి నివేదించినట్లు తెలిసింది. ఆ భూమిని గ్యాస్ కంపెనీకి అప్పగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. అయితే దానికి కావాల్సిన మిగతా 1,500 ఎకరాల భూమిని ఎలా చేస్తారనేది ప్రశ్నార్థకం. ఇప్పటి వరకు కంపెనీ ప్రతినిధులు కానీ, అధికారులు కానీ రైతుల వద్ద నుంచి భూములు కొనుగోలు చేయలేదు. కనీసం కౌలు భూములుగా తీసుకుంటున్న ప్రక్రియనైనా ప్రారంభించలేదు. అసలు భూమిని కౌలుకు తీసుకుంటారా? కంపెనీకి కావాల్సిన గడ్డిని పెంచి ఇచ్చేందుకు కౌలు ధర మొత్తంగా ఇంతని తీసుకుంటారా? అనేది స్పష్టత లేదని తెలుస్తోంది. ఇలాంటి ప్రక్రియలేమీ జరగడం లేదు. కేవలం ప్రభుత్వ భూమిగా చెప్తున్న స్థలాన్ని వారం రోజులుగా శుభ్రం చేస్తున్నారు. జిల్లా అధికారులు, మంత్రులు, హడావుడి చేస్తున్నారు.

శుద్ధ జలం ఇవ్వండి మహా ప్రభో..

రాష్ట్రంలో ఉద్దానం తర్వాత ఫ్లోరైడ్ బాధితులు అత్యధికంగా ఉన్న జిల్లా ప్రకాశం. అందులో కనిగిరి ప్రాంతం. ఇక్కడ ఫ్లోరోసిస్ నీటిలో అత్యధికంగా 7.2 పీపీఎం ఫ్లోరైడ్ ఉంటుంది. నియోజకవర్గంలోని పీసీపల్లి మండలంలో అత్యధికంగా ఫ్లోరైడ్, కిడ్నీ, క్యాన్సర్ బాధితులు ఉన్నారు.

అనేక మంది కిడ్నీ, క్యాన్సర్ రోగాలతో చనిపోయారు. ప్రస్తుతం పీసీపల్లి మండలం నుంచి సుమారు 40 మందికి పైగా డయాలసిస్ పేషంట్లు ఉన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి పీసీపల్లి పల్లి ప్రాంతంలో శుద్ధ జల ప్లాంట్లను కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడి ప్రజలు పార్టీలకతీతంగా కోరేది ఒక్కటే వెలిగొండ ప్రాజెక్టు జలాల పరిధిలో పీసీపల్లి మండలాన్ని చేర్చాలి. ప్రజలకు తాగు, వాడుక నీటిని అందించాలి. ఇప్పటికే అనేక మార్లు మండల సమావేశాల్లో తీర్మానాలు చేశారు. అన్ని పార్టీల అధినేతలకు వినతి పత్రాలు అందజేశారు.

ఆర్భాటంతోనే సరినా..!



పామూరు మండలం దూబగుంట వద్ద ట్రిపుల్ ఐటీ పైలాన్‌ను 2018లో ఆవిష్కరిస్తున్న చంద్రబాబు(ఫైల్)

వాస్తవానికి టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ నేతలు చేపట్టిన ప్రాజెక్టులు జిల్లాలోని కనిగిరి నియోజకవర్గంలో ఎక్కడా పూర్తిగా కార్యరూపం దాల్చలేదు. ట్రిపుల్ ఐటీ కళాశాల మూలన పడింది. సోలార్ హబ్ ఊసే లేదు. అయితే తాజాగా జిల్లాకు చెందిన మంత్రులు ఈ ప్రాంతంలో పర్యటించారు. దొనకొండ, సీఎస్‌పురం ప్రాంతాల్లో అల్ట్రా మెగా సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. అలాగే కనిగిరి పట్టణంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణానికి సంబంధించి కూడా ప్రకటనలు చేశారు. అంతేకాకుండా.. మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులు వచ్చి కనిగిరి చెరువును పరిశీలించి వెళ్లారు. తర్వాత ఏమైందో ఎవరికీ తెలియదు.

ముందు తాగేందుకు మంచినీళ్లివ్వండి..



పీసీపల్లి మండలంలో ఫ్లోరైడ్ నీటి సమస్యతో ఇప్పటికే అనేకమంది చిన్న వయసులోనే కిడ్నీ వ్యాధుల బారిన పడి మృత్యువాత పడ్డారు. ముందు మాకు కావాల్సింది మంచినీళ్లు. ఇప్పుడు కొన్ని గ్రామాలకు వస్తున్న రామతీర్థం జలాలు కూడా సక్రమంగా రావడం లేదు. అందరికీ సురక్షిత మంచినీటిని అందించాలి.
– గోపవరపు బొర్రారెడ్డి మండల పార్టీ కన్వీనర్ పీసీపల్లి

భవిష్యత్తు తరాలకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాటు చేయాలి



రాబోయే తరాల వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. ఇప్పటికే అనేక వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఫ్లోరైడ్ నీరు తాగి కిడ్నీల చెడిపోయి చిన్న వయసులోనే మృత్యువాత పడుతున్నారు. మార్రెళ్ల ఎస్సీ పాలెంలో ఇటీవల ముగ్గురు చనిపోయారు. మరో నలుగురు డయాలసిస్ చేయించుకుంటున్నారు.
– పరిమి వెంకట్రావు మార్రెళ్ల సర్పంచ్

కార్యకర్తలకు కొండంత అండగా వైఎస్ జగన్





కాటమరాజు స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, నాయకులు దద్దాల నారాయణయాదవ్, యనమల నాగార్జున యాదవ్, వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభ వద్ద పాట కచేరిని తిలకిస్తున్న కార్యకర్తలు, ప్రజలు

● వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దారవీడు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, మనందరికీ కొండంత అండగా పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ భరోసా ఇచ్చారు. మండలంలోని గుండంచర్ల గ్రామం సమీపంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం వేనూతల కాటమరాజుస్వామి, గంగాభవానీ అమ్మవార్లకు ఎమ్మెల్యేతో పాటు కనిగిరి నియోజకవర్గ సమన్వయకర్త దద్దాల నారాయణ యాదవ్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యేతో పాటు నారాయణ యాదవ్, నాగార్జున్ యాదవ్‌లు బొల్లావును నెత్తిన పెట్టుకొని కొద్దిసేపు ఆడించారు. వారిని పూలమాల, శాలువలతో ఆలయ కమిటీ సభ్యులు, యాదవులు ఘనంగా సన్మానించారు. అనంతరం వైఎస్సార్ సీపీ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, రాబోయే కాలంలో మనందరి ప్రభుత్వం వస్తుందని అప్పుడు మన సత్తా ఏమిటో చూపిద్దామని ధైర్యాన్ని ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో అరాచకాలు, అక్రమాలు, ప్రలోభాలకు గురి చేసినా ఉప ఎన్నికల్లో అంతిమ విజయంలో వైఎస్సార్ సీపీ సత్తాచాటిందని చెప్పారు. యాదవులకు ఎలాంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని, ఎప్పుడూ ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. యాదవులు, పేద ప్రజల బతుకులు మారాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తిరునాళ్ల సందర్భంగా కాటమరాజుస్వామి, గంగా భవాని తల్లి పుష్కలంగా వర్షాలు కురిపించి పశుసంపద, పాడి పంటలతో తులతూగేలా భక్తులను ఆశీర్వదించి చల్లగా చూసి కాపాడాలని వేడుకుంటూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారని గుర్తు చేశారు. ఆలయం అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు వచ్చేందుకు చర్యలు చేపడతానని అన్నారు. మీ అందరి ఆశీర్వాదంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయిన తర్వాత ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి, నేరుగా ఆయనతోనే పనులకు శంకుస్థాపన చేసేందుకు తీసుకుని వస్తానని చెప్పడంతో యాదవులు ఈలలు, కేరింతలతో స్వాగతం పలికారు. ఆలయానికి వచ్చే సింగిల్ రహదారిని డబుల్ రహదారిగా వేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దద్దాల నారాయణ యాదవ్, నాగార్జున యాదవ్‌లు మాట్లాడుతూ బీసీలంటే వైఎస్ జగన్‌మోహనరెడ్డికి అమితమైన ఆప్యాయత ఉంది కాబట్టే కాటమరాజు స్వామి తిరునాళ్ల గురించి తెలుసుకొని ట్వీట్ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. దీనిని బట్టి జగన్‌మోహన్‌రెడ్డికి యాదవులంటే ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. యదవులంతా ఐక్యంగా ఉండి రాబోవు ఎన్నికల్లో ఆయన్ను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు మనందరం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభపై పాట కచ్చేరి ఏర్పాటు చేశారు. తిలకించేందుకు పశ్చిమ ప్రాంతం నుంచి యాదవులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి బూచేపల్లి, సురేష్ పూజలు



అన్నదానం ప్రారంభిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్ రెడ్డి, మాజీ మంత్రి సురేష్

కొండపి:

విశ్వావసు నామ సంవత్సరం ఉగాది సందర్భంగా మండలంలోని జాళ్లపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల సందర్భంగా ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దర్శి శాసనసభ్యుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మండల నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, పాడిపంటలతో, ఆనందోత్సవాలతో గడపాలన్నారు. అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాకా పిచ్చిరెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా జాళ్లపాలెం గ్రామంలోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మాజీ మంత్రి సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, గ్రామ సర్పంచ్, భువనగిరి సత్యనారాయణ, నియోజకవర్గ పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షుడు షేక్ వన్నూరు, బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వసంతరావు, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు గంగాధర్, మండల సీనియర్ నాయకులు బొక్కిసం సుబ్బారావు, బచ్చల కోటు, వాకా శ్రీకాంత్ రెడ్డి రవీంద్రారెడ్డి, బ్రహ్మయ్య కార్తీక్, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రంజాన్‌కు ప్రత్యేక బందోబస్తు

● ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలకు భారీ సంఖ్యలో తరలివచ్చే ముస్లింలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ముస్లిం సోదరులందరికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్రమైన రంజాన్ మాసం మొత్తం కఠోర ఉపవాస దీక్షలతో, దైవ ప్రార్థనలతో గడిపి, పేదలకు సాయం చేస్తూ పండుగ జరుపుకుంటారని చెప్పారు. త్యాగం, సేవానిరతి, పవిత్రతకు ప్రతీకైన రంజాన్ పండుగను సుఖశాంతులతో జరుపుకోవాలని, ప్రతి ఒక్కరిపై అల్లా కృపా కటాక్షాలు ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన ఈశ్వరమ్మ

పొన్నలూరు: కుటుంబ కలహాల నేపథ్యంతో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని రావులకొల్లు ఎస్సీ కాలనీలో ఆదివారం జరిగింది. పోలీసులు, గ్రామస్తుల వివరాల మేరకు..రావులకొల్లు గ్రామానికి చెందిన దుగ్గిరాల ఈశ్వరమ్మ(38)కు అదే గ్రామానికి చెందిన మల్లికార్జునతో సుమారుగా 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె రమ్య ఉంది. వివాహం అనంతరం కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ బేల్దారీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది నుంచి మల్లికార్జున, ఈశ్వరమ్మ హైదరాబాద్ వెళ్లకుండా రావులకొల్లులో పొలం కౌలుకి తీసుకొని పొగాకు వేసి పొలం పనులు చేసుకుంటూ ఉంటున్నారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఇటీవల ఈశ్వరమ్మ గ్రామంలోనే తన పుట్టింటికి వెళ్లి మళ్లీ కొన్ని రోజుల తరువాత భర్త దగ్గరకు వచ్చింది. ఆదివారం ఉగాది పండుగ కావడంతో ఇంట్లో పనులు చేసుకున్న తరువాత ఏమైందో ఏమో ఈశ్వరమ్మ ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఇంటికి వచ్చిన భర్త గ్రామస్తుల సహకారంతో ఈశ్వరమ్మ మృతదేహాన్ని కిందకి దించి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఈశ్వరమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనూక్ తెలిపారు.



కారుణ్య వర్షిణి.. రంజాన్

● నేడు ఘనంగా పండుగ జరుపుకునేందుకు ఏర్పాట్లు
● ముగిసిన ఉపవాస దీక్షలు ● ఈదుల్ ఫిత్ర్‌కు ముస్తాబైన ఈద్గాలు, మసీదులు

రంజాన్ ప్రార్థనలకు ఈద్గాలు, మసీదులు సిద్ధం...

రంజాన్ ప్రార్థనల కోసం జిల్లావ్యాప్తంగా ఉన్న ఈద్గాలు, మసీదులు సిద్ధమయ్యాయి. అర్ధవీడు రోడ్డులో ఈద్గా మైదానాన్ని ముస్లిం పెద్దలు ముస్తాబు చేశారు. ప్రార్థనల కోసం వచ్చే వారికి సౌకర్యంగా టెంట్లు, మంచినీటి వసతి కల్పించారు. ఉదయం 8.30 నిమిషాల్లోపు ఈద్గా మైదానానికి చేరుకుంటే 9.00 గంటలకు నమాజు ప్రారంభమవుతుందని ముస్లిం పెద్దలు తెలిపారు. ఈద్గా వద్దకు రాలేని వారి కోసం మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించనున్నారు.


ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు (ఫైల్)

కంభం/కనిగిరి రూరల్: వరాల వసంతం, శుభాల సరోవరం రంజాన్ మాసం ఆదివారంతో ముగిసింది. సర్వమానవాళికి కారుణ్యవర్షిణి అయిన రంజాన్ మాసం వేనవేల దైవానుగ్రహాలను ప్రపంచమానవులకు పంచి పెట్టింది. ఆదివారం నెలపొడుపు కనిపించడంతో నేడు ముస్లింలు రంజాన్ పండుగ జరుపుకోనున్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో ఈదుల్ ఫిత్ర్ (రంజాన్) జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. రంజాన్ మాసంలో కఠోర ఉపవాసదీక్ష చేసి అల్లాహ్‌ను మెప్పించడానికి ముస్లింలు విశ్వప్రయత్నాలు చేశారు. నెలరోజుల పాటు ఉపవాసాలు పాటించి తరావీహ్ నమాజ్ చదివి సన్మార్గంలో నడిచిన దాసులకు ఇది నిజమైన పండుగ అని చెప్పవచ్చు. ముస్లిం దాసులు తమ నెలపాటి శ్రమకు తగిన ప్రతిఫలాన్ని అల్లాహ్ నుంచి పొందే రోజే రంజాన్ పండుగ రోజు. రంజాన్ పండుగ స్ఫూర్తిని గుండెల నిండా నింపుకుని ఈ ఆనందంలో అందరినీ భాగస్వాములు చేసేందుకు ముస్లింలు ప్రయత్నిస్తున్నారు. జకాత్, ఫిత్రా, సదకాల పేరుతో సమాజంలోని అభాగ్యుల పట్ల తమ బాధ్యతను లోపరహితంగా నెరవేర్చారు. కులమతాలు, వర్గవిభేదాలకు అతీతంగా మంచి మనుషులుగా స్పందిస్తూ సమాజంలోని దారిద్ర్యం, పేదరికం, అసమానతలను దూరం చేశారు. శాంతి సామరస్యాలను, సంతోషాన్ని పెంపొందింపజేయడమే నిజమైన రంజాన్ పండుగ అనే సందేశం అందించారు.

ఈద్గాలలో నమాజ్‌లు...

మహాప్రవక్త మహమ్మద్ (సఅసం) హిజ్రీ శకం 2వ సంవత్సరం.. అంటే క్రీ.శ.624 మార్చి 27వ తేదీ (షవ్వాల్ మాసం మొదటి తేదీ)న మొట్టమొదటిసారి తన సహచరులతో కలిసి ఈదుల్ ఫిత్ర్ రంజాన్ పండుగ జరుపుకున్నారు. ఆ రోజు ఉదయం ఆయన ముస్లింలందరినీ వెంటబెట్టుకుని మదీనా పట్టణానికి బయట ఉన్న ఒక పెద్ద మైదానంలో సమావేశమై రంజాన్ పండుగ నమాజు చేయించారు. ఆ తర్వాత ఖుద్బా ప్రసంగం ఇచ్చారు. అప్పటి నుంచి ముస్లింలు రంజాన్, బక్రీద్ పండుగలకు ఊరిబయట గల ఈద్గాలలో నమాజ్ చెయ్యడం ప్రారంభమైంది. రంజాన్ పండుగ రోజు తలస్నానం చేసి కొత్త దుస్తులు ధరించి ఈద్ నమాజ్ కోసం ఊరిబయట ఈద్గాకు వెళ్తారు. ఆ సమయంలో 'అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహు, అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్' అని దైవనామాన్ని స్మరిస్తారు. 'అంటే.. అల్లాహ్ గొప్పవాడు.. ఆయన మహిమానిత్వుడు.. ఆరాధనకు ఆయన తప్ప ఎవరూ అర్హులు కారు.. అల్లాహ్ గొప్పవాడు.. సకల కృతజ్ఞతలు ఆయనకే చెల్లు' అని అర్థం. పండుగ నమాజ్ రెండు రకాతులు (వాజిబ్). దానికి ముందుగానీ, తర్వాతగానీ ఎలాంటి అదనపు నమాజులు లేవు. పండుగ నమాజు మొదటి రకాతులో 'ఫాతిహా' సూరా. ఆ తర్వాత గాషియా లేదా ఖౌఫ్ అధ్యాయం. రెండో రకాతులో 'ఖమర్' అధ్యాయం పఠించాలి. పండుగ శుభసందర్భంగా మనందరి అపరాధాలను మన్నించి సన్మార్గంలో నడిపించాలని అల్లాహ్‌ను వేడుకోవాలి.

కనిగిరిలో ఈద్గా నమాజ్ సమయం...

కనిగిరి రూరల్: కనిగిరి పట్టణంలో ఈద్గా వద్ద సోమవారం రంజాన్ ప్రత్యేక నమాజ్ జరుగుతుంది. కనిగిరి–పొదిలి రోడ్డులోని పెద్ద చెరువు వద్ద గల ఈద్గా వద్ద ఉదయం 10 గంటలకు బయాన్, 10.30 గంటలకు నమాజ్ జరుగుతుంది. అలాగే మసీద్ ఏ అలీలో ఉదయం 8 గంటలకు బయాన్, 8.30 గంటలకు నమాజ్ జరుగుతుందని ఛోటి మసీద్ ప్రెసిడెంట్ హుస్సేన్ తెలిపారు. ముస్లింలు అత్యధికంగా పాల్గొని రంజాన్ ప్రత్యేక నమాజ్ చేసుకోవాలన్నారు. ఈద్గా ప్రాంతంలో అంజుమన్ ఏ ఇస్లామియా కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే అహమ్మద్‌బాషా, ఈద్గా కమిటీ నాయకులు, పెద్దలు ప్రత్యేక నమాజ్‌కు ఏర్పాట్లు చేశారు. ఆదివారం రాత్రి నెల వంకను చూసిన తర్వాత ముస్లింలు ఒకరికొకరు ఈద్ ముబారక్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కనిగిరి పట్టణంలో రంజాన్ సందడి నెలకొంది.

ఒంగోలు నగరంలో రంజాన్ ఈద్ నమాజు వేళలు...

ఒంగోలు టౌన్: పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా నేడు ఒంగోలు నగరంలోని వివిధ మస్జీద్‌లలో ఈద్ నమాజ్ ఏర్పాటు చేసినట్లు తబ్లీగ్ జమాయత్ జిల్లా బాధ్యుడు సయ్యద్ హమీద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు రోడ్డులోని జుబేదా మస్జీద్, కేశవరాజుగుంటలో మహ్మదీయ మస్జీద్‌లలో ఉదయం 7 గంటలను బయాన్ మొదలవుతుందని, 7.30 గంటలకు నమాజ్ జరుగుతుందని తెలిపారు. గంటాపాలెంలోని నూర్ మస్జీద్, ఇస్లాంపేట 1వ లైనులోని మదీనా మస్జీద్, బిలాల్ నగర్‌లోని బిలాల్ మస్జీద్‌లలో ఉదయం 8 గంటలకు బయాన్, 8.30 గంటలకు నమాజ్ మొదలవుతుందన్నారు. పోలీసు క్వార్టర్స్‌లోని కౌసర్ మస్జీద్, అన్నవరప్పాడులోని మదీనా 2 మస్జీద్, బండ్లమిట్టలోని మీనా మస్జీద్, బలరాం కాలనీలోని అబూబకర్ మస్జీద్‌లలో ఉదయం 8.30కు బయాన్, 9 గంటలకు నమాజ్ జరుగుతుందని తెలిపారు. ఇస్లాంపేట–2లోని మక్కా మస్జీద్, ప్రకాశం కాలనీలోని హుసేని మస్జీద్, ప్రత్తి వారిస్ట్రీట్‌లోని మర్కజ్ మస్జీద్, కొండమిట్టలోని రహమత్ మస్జీద్‌లలో 9 గంటలకు బయాన్, 9.30 గంటలకు నమాజ్ జరుగుతుందన్నారు. మంగమూరు డొంక జంక్షన్‌లోని ఏక్ మినార్ మస్జీద్, పీర్లమాన్యంలోని అరఫ్ మస్జీద్, ఆర్టీసీ బస్టాండులోని నిసార్ మస్జీద్, కొప్పోలులోని అయిష మస్జీద్, ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద గల ఇనామ్ మస్జీద్‌లలో 9.30కు బయాన్, 10 గంటలకు నమాజ్ జరుగుతుందని వివరించారు. రంగుతోటలోని జామియా మస్జీద్‌లో 10 గంటలకు బయాన్, 10.30కు నమాజ్ జరుగుతుందని తెలిపారు. ఈద్గా మైదానంలో ఉదయం 10.30 గంటలకు బయాన్, 11 గంటలకు నమాజ్ జరుగుతుందన్నారు. ముస్లింలు ఈ నమాజ్ వేళలను గమనించాలని కోరారు. సౌకర్యాన్ని బట్టి వీలైనంత త్వరగా నమాజ్ పూర్తి చేసుకోవాలని సూచించారు.

అనేక సమయాల్లో ప్రార్థనలు...

రంజాన్ పండుగను భారతదేశంతో పాటు ప్రపంచ దేశాల్లోని ముస్లింలు ఘనంగా జరుపుకుంటారు. ఇస్లామియా దేశాల్లో రంజాన్ పండుగను అధికారికంగా నిర్వహిస్తారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ముస్లింలు పండుగ నమాజు కోసం నగరాల్లోని పెద్దపెద్ద మసీదులకు, ఉద్యాన వనాలకు వెళ్తారు. పెద్ద సంఖ్యలో హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం అనేక సమయాల్లో ప్రార్థనలు జరుపుతారు. సౌదీ అరేబియాలో ఈదుల్ ఫిత్ర్ చాలా ముఖ్యమైన పండుగ. అక్కడి జంటనగరాలైన మక్కా, మదీనాలలో అత్యంత భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకుంటారు. అక్కడి ధనికులు పెద్ద మొత్తంలో నిత్యావసర సరుకులను ఎవ్వరికీ తెలియకుండా పేదవారి ఇళ్ల వద్ద ఉంచి రావడం ఆ దేశ ప్రజల సంప్రదాయం.


కనిగిరిలో రంజాన్ ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గా ప్రాంగణం


కనిగిరిలో నమాజ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అంజుమన్ కమిటీ నాయకులు

రామతీర్థంలో బూచేపల్లి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి రూరల్: గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభ పనులు ప్రారంభించే ముందుగా ఆదివారం రామతీర్థం పుణ్యక్షేత్రంలోని గంగమ్మ తల్లి గుడిలో బూచేపల్లి కుటుంబం ప్రత్యేక పూజలు నిర్వహించింది. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా మోక్షరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పూజలు చేశారు. గంగమ్మ తల్లి గుడి ఆధ్వర్యంలో వచ్చే నెల 11వ తేదీ చీమకుర్తిలో మందిరాల సంబరాలు, 12వ తేదీ రామతీర్థంలో తిరునాళ్లకు సంబంధించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చీమకుర్తి మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు కృష్ణపాటి శేఖర్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, జి.పూర్ణచంద్ర, జి.సుందరరామిరెడ్డి, సోమా శేషాద్రి, పత్తి కోటు, గాంధీ, ఎల్లయ్య, మారం శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలో సర్వతోముఖాభివృద్ధి చెందాలి

● ఉగాది వేడుకల్లో మంత్రి డోలా



ఉగాది వేడుకల్లో పంచాంగ పఠనం చేస్తున్న వేదపండితుడు మఠంపల్లి దక్షిణామూర్తి. పాల్గొన్న మంత్రి, జేసీ, ప్రజాప్రతినిధులు, అధికారులు

ఒంగోలు సబర్బన్: స్వస్తిశ్రీ శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆకాంక్షించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన ఉగాది ఉత్సవాలలో మంత్రితో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. వేదపండితులు మఠంపల్లి దక్షిణామూర్తి పంచాంగం చదివి వినిపించారు. అనంతరం ఉగాది కవి సమ్మేళనం జరిగింది.

పలువురికి ఉగాది పురస్కారాలు...

ఉగాది వేడుకల్లో పలువురికి పురస్కారాలు అందించారు. వారిలో మాధవాచారి (ఆర్టిస్ట్), ఇమ్మాన్యుయేల్ (ఫ్లూటిస్ట్), శివకుమారి (నళిని ప్రియ కూచిపూడి నృత్యానికేతన్), ఆదినారాయణ (సాహిత్యవేత్త), షేక్ ఖాసిం (మ్యూజిక్ డైరెక్టర్ ఇన్ ఫిలిమ్స్) ఉన్నారు. దేవదాయ శాఖ తరఫున అర్చకులు నంద్యాల ప్రసాదాచార్యులు, కొండవీటి సుదర్శనాచార్యులు, శంకరమంచి ప్రసాదశాస్త్రి, మండాడి నరసింహమూర్తిని సన్మానించి ఉగాది పురస్కారాలు అందజేశారు. వేడుకల్లో ఏపీ మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డా.విజయ కుమార్, ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, డీపీఓ వెంకట నాయుడు, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, దేవదాయ శాఖ ఏసీ జనార్దన్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ హేనసుజన, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డీటీసీ సుశీల, సీపీఓ వెంకటేశ్వరరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతుడు (ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కంభం: పంటపొలాల్లో విద్యుదాఘాతానికి గురై అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి మండలంలోని లింగాపురం అటవీ సమీపంలోని తిప్ప వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని యర్రబాలెం గ్రామానికి చెందిన పాలెబోయిన వెలిగొండయ్య (47) మరికొందరు కలసి లింగాపురం సమీపంలో కొండల వద్దకు జీవాల కోసం వేటకు వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో ఓ పొలానికి వేసి ఉన్న విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కంభం సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు ఆదివారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కొండకు సమీపంలో ఉన్న ఓ బీడుపొలంలో ఎటువంటి పంట లేకపోయినా చుట్టూ ఉన్న తీగలకు విద్యుత్ కనెక్షన్ ఎందుకిచ్చారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఇళ్ల స్థలాల విషయంలో సాకులు తగదు

● ఒంగోలులో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన స్థలాలకు పట్టాలివ్వాలి
● ఏప్రిల్ 10న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో లబ్ధిదారులు పాల్గొనాలి
● కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలి
● సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ పిలుపు

ఒంగోలు టౌన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నగరంలోని నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను పంపిణీ చేయకుండా కూటమి ప్రభుత్వం సాకులు చెప్పడం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో 300 కోట్ల రూపాయలతో ఒంగోలు నగరంలోని అగ్రహారం, చెరువుకొమ్ముపాలెం ప్రాంతాల్లో 430 ఎకరాల భూమి కొనుగోలు చేసి లే ఔట్ వేసి 22 వేల మందికి పట్టాలు పంపిణీ చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం ఎక్కువ మంది అనర్హులకు పట్టాలు పంపిణీ చేసిందనే సాకుతో పట్టాలు పంపిణీ చేయకపోవడం సమంజసం కాదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒక్కొక్కరికి 2 సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు ఇస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం పాత లే ఔట్‌ను మార్చివేసి 2 సెంట్ల ప్రకారం కొత్త లే ఔట్ వేసి లబ్ధిదారులకు స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఇంటి నిర్మాణం కోసం రూ.4 లక్షలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని తెలిపారు. తక్షణమే ఇంటి పట్టాలు పంపిణీ చేసి ఇంటి నిర్మాణానికి 4 లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు. ఏప్రిల్ 10వ తేదీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అగ్రహారం, చెరువుకొమ్ముపాలెం ఇంటి స్థలాలను సందర్శిస్తారని, అనంతరం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో పాల్గొంటారని చెప్పారు. ఇంటి స్థలాల పంపిణీ విషయంలో కలెక్టర్‌తో చర్చిస్తారని తెలిపారు. ఒంగోలు నగరంలో పట్టాలు పొందిన 22 వేల మంది లబ్ధిదారులు పట్టాల జెరాక్స్ కాపీలతో ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.వెంకటరావు మాట్లాడుతూ ఆగస్టు నెలలో ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎం.విజయ, ఆర్.రామకృష్ణ, గద్దల రవి, శ్రీరాం శ్రీనివాసరావు, పి.రాంబాబు, సీహెచ్ వెంకటేశ్వర్లు, రమేష్, కారుమూడి నాగేశ్వరరావు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జాళ్లపాలెం తిరునాళ్ల


వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు

● పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్న భక్తులు

కొండపి: మండలంలో చిన్నమఠంగా ప్రసిద్ధి చెందిన జాళ్లపాలెంలో వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగింది. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచే బారులు తీరి కనిపించారు. భక్తులు మొక్కలు తీర్చుకుంటూ హోమగుండంలో కొబ్బరి చిప్పలు వేస్తూ గుడి చుట్టూ ప్రదక్షిణాలు చేశారు. పలువురు రాజకీయ నాయకులు, అధికారులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. సేవా సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, మజ్జిగ, మంచినీళ్లు పంపిణీ చేశారు. సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో 200 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌పై కత్తితో దాడి

చీరాల: సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌పై అదే గ్రామానికి చెందిన వారు కత్తితో దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటన ఆదివారం చీరాల మండలం గవినివారిపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చీదరబోయిన నాగేశ్వరరావు సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. బంధువులతో కొంతకాలంగా స్థల వివాదం చోటుచేసుకోగా, ఆదివారం ఘర్షణ జరిగింది. చీదరబోయిన వీరయ్య, భరత్‌కుమార్, లక్ష్మీనారాయణ, మరికొందరు కలిసి కానిస్టేబుల్‌పై కత్తితో దాడి చేసి గాయపరిచారు. స్థానికులు చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించగా, ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఉగాది వేడుకలు

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారామచంద్రస్వామి భక్తజన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఎస్పీ ఏఆర్ దామోదర్ సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎస్పీ దంపతులు నూతన పంచాంగావిష్కరణ చేశారు. దేవాలయ ఆవరణలో రాగి మొక్క నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బందికి శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సంతోషంగా ఉగాది పండుగ జరుపుకోవాలని కోరారు. జిల్లా పోలీసు క్వార్టర్స్‌లో ఉన్న శ్రీ రామచంద్రస్వామి దేవస్థానంలో వచ్చే నెల 7వ తేదీ వరకు వసంత నవరాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు సీతారామిరెడ్డి, రవణారెడ్డి, ఖాసింవలి, ఆలయ ప్రధాన అర్చకులు ఎం.రమణ దీక్షితులు, ఏఆర్ ఎస్సైలు, భక్తజన సేవా సమితి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.